# వెలుగూ - వేడీ

శీలా వీర్రాజు కవిత

పల్లెటూరి డొంకల్నీ ఊరి చివరి పుంతల్నీ
పొలంగట్ల కంపల్నీ
చిమ్మ చీకటి రాత్రుళ్ళు
వెలిగి ఆరే దీపాల్తో అలంకరించినట్టు
మెరుస్తున్నాయి మిణుగురు పురుగులు
పట్టణాల్లో శుభకార్యాలకి
అలంకరణగా వెలిగించే
ఫేన్సీ దీపాల మాలా తోరణాల్లో
వెల్తురుకన్న అందమే ఎక్కువ.
మిణుగురుల వెలుగులోనూ అంతే
అందుకే అవి తారల్లాటివి
రాత్రి అందాన్ని పెంచే
మిణుకు మిణుకు దీపాలవి

కాని
వెలిగే ప్రతీదీ వేడినివ్వదు
గుప్పెడు మిణుగురుల్ని మూటగట్టినా
గుడ్డిపీలికైనా కాలదు
అందుకే నాకు
ప్రాణం వున్న మిణుగురుకన్న
ప్రాణంలేని చెకుముకిరాయే యిష్టం
అది కక్కే నిప్పురవ్వకు
వెల్తురు తక్కువైనా వేడి వుంటుంది
క్షణ కాలమే మెరిసి మాయమైనా
సకాలంలో పట్టి బంధిస్తే
పదిమందికి వెలు గిచ్చే మంటవుతుంది.



మినీ కథ

# గొలుసుకట్టు వ్యవహారం

కంపెనీ యిచ్చిన యూనిఫార్మ తెల్లని పాంటు మీద తెల్లని పొడవాటి ఫుల్ హాండ్ బుష్ షర్టు వేసుకొని డోర్ పక్కన స్టూలుమీద అటెంటివ్‌గా కూర్చున్నాడు అటెండరు, కాలింగ్‌బెల్ ఏ క్షణంలోనైనా మోగుతుందని ఎదురు చూస్తూ.

గ్లాస్కో పంచె, సిల్కులాల్చీ ధరించిన కంట్రాక్టరు హడావిడిగా వచ్చి మేనేజింగ్ డిరెక్టర్ దర్శనం కోరేడు. అటెండరు గోడకి వ్రేలాడుతూన్న కాగితం ముక్కల్లోంచి ఒకటి తీసి అందించాడు అలవాటుగా. కంట్రాక్టర్ రాసిచ్చిన స్లిప్పు తిరిగి తీసుకొని స్ప్రింగు తలుపు తెరిచి లోనికి వెళ్ళి మేనేజింగ్ డిరెక్టర్ టేబులు మీద పెట్టి వచ్చాడు.

ఎప్పటికీ పిలుపు రాకపోతే బయట కుర్చీ మీద కూర్చున్న కంట్రాక్టరు తొందర చేస్తూ అటెండరు చేతిలో బక్షీసు వుంచాడు. అటెండరు ఆ తర్వాత లోనికి వెళ్ళి వచ్చిన రెండు క్షణాలకి బెల్లు మోగింది. అటెండరు వెనకాలే కంట్రాక్టరు దారి తీశాడు.

అటెండర్ మళ్ళా వచ్చి స్టూలుమీద కూర్చున్నాడు. ఎవరెవరో వచ్చి మేనేజింగ్ డిరెక్టర్ని కలుసుకుని వెళ్ళేరు. అటెండర్ జేబు తడుముకున్నాడు. పరవాలేదనిపించింది.

కూతురి పెళ్ళి కుదిరింది. నెల రోజులకి అటు ముహూర్తం అమిరింది. అడ్వాన్స్ గురించి తాను కంపెనీకి దరఖాస్తు పెట్టుకుంటే ఆ కాగితం యింకా క్లర్కు దగ్గరే మగ్గుతోంది. మామూలు ఇచ్చేస్తే పోయె' అనుకున్నాడు అటెండర్.

తన డ్యూటీ ఓ పావుగంట మరొకడికి అప్పజెప్పి అస్టాబ్లిష్‌మెంట్ సెక్షన్‌కి అటెండరు కదిలాడు. మామూలు ముట్టజెప్పి క్లర్కు దగ్గర తన పర్సనల్ ఫైల్ తీసుకొని సూటిగా వెళ్ళి సూటుబూటుతో టిప్‌టాప్‌గా వున్న మేనేజింగ్ డిరెక్టర్‌కి పుటప్ చేశాడు, మేరేజి అడ్వాన్స్ ఆ రోజే అందే తీరుతుందనే ధీమాతో.

ఇంటికి వెళ్ళాక ఎస్టాబ్లిష్‌మెంట్ క్లర్కు ఆ రోజు దొరికిన మామూళ్ళతో కలిపి మొత్తం లెక్క చూసుకున్నాడు. ఇంకా జాప్యంచేస్తే తన ప్రమోషను ఇంకొకడు కొట్టేసే అవకాశం వుందని వూహించి చీకటిపడ్డ తరవాత మేనేజింగ్ డిరెక్టర్ బంగళాకి వెళ్ళేడు కాళ్ళీడ్చుకుంటూ. బాస్ గుడ్ మూడ్స్‌లో ఉండటం చూచి సంతోషంతో తన సంగతి విన్నవించుకున్నాడు. చేతిలో కవరు ముందుంచి ఖాళీ చేతులు జోడించి తిరిగి వచ్చాడు, తన సీనియారిటీకి తోడు లంచం పెట్టినందుకు వెళ్ళిన పని ఖాయం అనుకుంటూ.

ఎలక్షన్లు దగ్గరపడడంతో. ఎన్నో ఖద్దరు పంచెలు, లాల్చీలు పార్టీ టిక్కెట్ల గురించి ఎగబ్రాకుతుంటే పార్టీ లీడర్లు విరాళాల గురించి గాలిస్తున్నారు.

ఆ తరుణంలో సదరు కంపెనీ మేనేజింగ్ డిరెక్టర్ తన అభిమాన పార్టీకి ఉడతా భక్తితో సాహాయ్యం చేశాడు ముమ్ముందు లభించే కంపెనీ లాభాల గురించి, అందులోనూ సొంత లాభం గురించి పథకాలు వేస్తూ.

ఎన్నికల ప్రచారం తొలిమైకు మోగింది.

సింగిశెట్టి సంజీవరావు